క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన జగిత్యాల టౌన్ ఎస్సై



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎస్సై

జగిత్యాల క్రైం: జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను టౌన్ ఎస్సైగా నూతనంగా బాధ్యతలు తీసుకున్న తిరుపతి బుధవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

న్యాయవాదులకు సన్మానం



న్యాయవాదులను సన్మానిస్తున్న చైర్మన్

రాయికల్: అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం కొత్తపెల్లి రంజిత్,బొల్లె రమేశ్,అల్లే పురుషోత్తం,అల్లే వనిత,మచ్చశేఖర్,చిట్యాల నిఖిల్,మాచర్ల స్వప్న,శ్రీలక్ష్మి న్యాయవాదులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మచ్చ శేఖర్, కోశాధికారి కట్ల నర్సయ్య,మాజీ జడ్పీలు మ్యాకలరమేష్,బతినిభూమయ్య,కాటిపెల్లి రాంరెడ్డి,సభ్యులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న యూత్ సభ్యులు

కోరుట్లరూరల్: మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన బండి మధు అనే యువకుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మధు చిన్న నాటి స్నేహితులు రూ. 2,42,500 జమ చేసి మధ కూతురు పేరు మీద బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చేసి బుధవారం పత్రాలను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా స్నేహితులను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో డైనమిక్ బాయ్స్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ నూతన కార్యవర్గం



మండల,పట్టణ నూతన కార్యవర్గం ఎన్నిక

ధర్మపురి: విశ్వహిందూ పరిషత్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ధర్మపురిలో ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కార్యదర్శి గజం రాజ్‌కుమార్ హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా ముత్యం రమేశ్, ఉపాధ్యక్షుడు పురంశెట్టి లచ్చన్న, గాదె లక్ష్మణ్, కార్యదర్శిగా వెలుగందుల బుచ్చన్న, సహాయ కార్యదర్శిగా ఎడ్ల రాజేశ్‌ను ఎన్నుకున్నారు. మండలశాఖ అధ్యక్షుడిగా మామిడాల రవీందర్, ఉపాధ్యక్షుడు మ్యాన పూర్ణచందర్, బజరంగదళ్ మండల సంయోజక్‌గా సోమిశెట్టి సాయిప్రసాద్‌ను ఎన్నుకున్నారు.

గురుపూజోత్సవం

మేడిపల్లి: మండలంలోని వెంకట్రావుపేటలో బుధవారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. గురువుల గొప్పతనం, విశ్వ గురువుగా మన దేశం యొక్క గొప్పతనం గురించి వివరించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయంలో పల్లకి సేవ



పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

జగిత్యాలటౌన్: తొలి ఏకాదశి పండుగ సందర్భంగా పట్టణంలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఏకాధశి పండుగను పరస్కరించుకుని బుదవారం ధనలక్ష్మీసూర్య నారాయణ సహిత శ్రీధన్వంతరి దేవాలయంలో స్వామివారికి పల్లకి సేవ నిర్వహించారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నిధులున్నా.. పనులు సున్నా

- నత్త నడకన ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణం
- 10 భవనాలకు రూ.20 లక్షల చొప్పున మంజూరు
- నాలుగు భవనాల పనులు ప్రారంభం
- 90 శాతం పనులు పూర్తయినా విడుదల కాని నిధులు



ఆరోగ్య ఉపకేంద్ర భవనానికి శంకుస్థాపన చేస్తున్న అప్పటి ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు



మోహన్‌రావుపేటలో అద్దె భవనంలో ఆరోగ్య ఉపకేంద్రం

కోరుట్ల రూరల్: గ్రామాల్లో ఆరోగ్య ఉపకేంద్రాలకు పక్కా భవనాల నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రూ. 20 లక్షల చొప్పున 10 భవనాలకు నేషనల్ హెల్త్ మిషన్ నిధులు మంజూరయ్యాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు కొందరు నిధులు విడుదల కాకున్నా పనులు ప్రారంభించగా కొందరు ఇంకా పనులు మొదలు పెట్టలేదు. దీంతో ఆరోగ్య ఉపకేంద్రాలు కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతుండగా, కొన్ని అద్దె గదుల్లో కొనసాగుతున్నాయి.

మండలంలో 10 భవనాలు మంజూరు

కోరుట్ల మండలంలో మొత్తం 10 ఆరోగ్య ఉపకేంద్ర భవనాల నిర్మాణాలకు నేషనల్ హెల్త్ మిషన్ నిధులు మంజూరు చేసింది. అయిలాపూర్ 2, జోగిన్‌పెల్లి 1, మోహన్‌రావుపేట 1, యూసుఫ్‌నగర్ 1, మాదాపూర్ 1, చిన్నమెట్‌పల్లి 1, కోరుట్ల పట్టణంలో ఏసికోనిగుట్ట1, అల్లమయ్య గుట్ట1, కల్లూర్ రోడ్ 1 మొత్తం 10 భవనాలకు రూ. 20 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది. అప్పటి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి, కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు.

నాలుగు మాత్రమే పనులు ప్రారంభం

పది భవనాలకు నిధులు మంజూరైనా అందులో నాలుగు భవనాల పనులు మాత్రమే మొదలు పెట్టారు. ఇంకా 6 భవనాల పనులు మొదలు పెట్టాల్సి ఉంది. జోగిన్‌పెల్లి, మోహన్‌రావుపేట, కోరుట్ల పట్టణంలోని ఏసికోనిగుట్ట, కల్లూర్‌రోడ్‌లో పనులు ప్రారంభం కాగా, అయిలాపూర్, యూసుఫ్‌నగర్, మాదాపూర్, చిన్నమెట్‌పల్లి, కోరుట్లలోని అల్లమయ్యగుట్ట ఆరోగ్య ఉపకేంద్రాల పనులు ఇప్పటికీ మొదలు కాలేదు. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్లు నిధులు ఇంకా విడుదల కావడంలేదని, పనులు 90 శాతం పూర్తయినా ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు నిధుల విడుదలకు చొరవ చూపి మిగతా 6 ఉపకేంద్రాల పనులు మొదలయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఒక్క బిల్లు కూడా రాలేదు



కోరుట్ల పట్టణంలోని ఏసికోని గుట్ట, కల్లూర్ రోడ్డులో రెండు భవనాలు కడుతున్నాం, ఏసికోని గుట్ట భవనం పనులు 90 శాతం పూర్తయ్యాయి. కల్లూర్ రోడ్డులో గోడల ప్లాస్టరింగ్ పనులు కొనసాగుతున్నాయి. ఇంత వరకూ ఒక్క బిల్లు కూడా రాలేదు.ప్రభుత్వం బిల్లులు విడుదల చేస్తే బాగుంటుంది.

– కాశిరెడ్డి మోహన్ రెడ్డి, కాంట్రాక్టర్

పనులు పూర్తయిన వాటి బిల్లులు పంపాం



పది భవనాలు మంజూరైతే 4 భవనాల పనులు కొనసాగుతున్నాయి. అందులో 2 పూర్తి కాగా మిగతా రెండు భవనాల పనులు ప్రోగ్రెస్‌లో ఉన్నాయి. పనులు పూర్తయిన వాటి బిల్లులు చేసి పంపించాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కోసం ఎ దురు చూస్తున్నాం. మంజూరు కాగానే కాంట్రాక్టర్లకు చెల్లిస్తాం.

– గోపాల్ డీఈ, పంచాయతీరాజ్

భక్తిశ్రద్ధలతో మొహర్రం



ఇటిక్యాలలో మొహర్రం వేడుకలు



కోరుట్లలో పులివేషధారుల సందడి



కథలాపూర్ మండలం దూలూర్‌లో పీరీల ఊరేగింపు

కోరుట్ల/ధర్మపురి/కథలాపూర్/మల్లాపూర్/మల్యాల/పెగడపల్లి: మొహర్రం వేడుకలు ముస్లింలు బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మసీదుల వద్ద ముస్లింలు పీరీలను ఊరేగింపుగా తీసుకెళ్లి, సాయంత్రం చెరువుల్లో నిమజ్జనం చేశారు. పీరీల ఊరేగింపులో హిందూ, ముస్లింలు కులమతాలకతీతంగా మొక్కులు చెల్లించుకుని అసై దులాటలు ఆడారు.



చిట్టాపూర్‌లో పులి వేషధారుల విన్యాసాలు



ధర్మపురిలో పీరీల ఊరేగింపు

ఆలయాలకు టీటీడీ నుంచి నిధులు మంజూరు

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసిన మున్నూరు కాపు సంఘం నాయకులు

జగిత్యాల: నియోజకవర్గంలోని పలు ఆలయాల అభివృద్ధికి టీటీడీ నుంచి నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం మాట్లాడారు. జగిత్యాల ప్రాంతంలోని 9 ఆలయాలకు రూ.10 లక్షల చొప్పున తిరుమల తిరుపతి దేవస్థానం రూ.90 లక్షలు మంజూరు చేసిందని, టీటీడీ చైర్మన్‌కు అభినందనలు తెలిపారు. గతంలో బీర్‌పూర్ లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి రూ.30 లక్షలు, దుబ్బరాజేశ్వరస్వామి ఆలయానికి రూ.80 లక్షలు మంజూరయ్యాయని, ప్రస్తుతం పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతి కుటుంబానికి రూ.2 లక్షల రుణమాఫీ చేయడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు గంగమల్లు, కూసరి అనిల్, కూతురు రాజేశ్, రాంమోహన్‌రావు, మల్లేశం, రఘుపతి, రాజన్న, సురేశ్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

నేడు రాయికల్‌లో ఎమ్మెల్యే పర్యటన

రాయికల్: పట్టణంలో గురువారం గుడేటిరెడ్డి సంఘ భవనంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ చేతుల మీదుగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేయనున్నారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన మున్నూరుకాపు సంఘం నాయకులు

ఇటీవల నూతనంగా ఎన్నికై న మున్నూరుకాపు జగిత్యాల జిల్లా శాఖ నాయకులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. నూతన సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ, కార్యదర్శి మల్లారెడ్డి, కోశాధికారి సుధాకర్, ఉపాధ్యక్షులు శంకరయ్య, సభ్యులు పాల్గొన్నారు.

'రైతు నేస్తం' కు ఏర్పాట్లు



రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ పరికరాలు

కథలాపూర్: పంటల సాగులో రైతులకు ఎదురయ్యే సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం రైతు నేస్తం కార్యక్రమం నిర్వహిస్తోంది. మండలకేంద్రంలోని రైతు వేదిక భవనంలో 'రైతు నేస్తం' కార్యక్రమానికి సంబంధించిన వీడియో కాన్ఫరెన్స్ పరికరాలు బిగించారు. కథలాపూర్ రైతు వేదికలో సుమారు రూ. 3.70 లక్షలు వెచ్చించి వీడియో కాన్ఫరెన్స్ పరికరాలు బిగించడంతో మండల రైతులు ఏలాంటి సందేహాలున్నా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, నిపుణుల సలహాలు, సూచనలు త్వరగా తెలుసుకునే వీలుంటుంది. గురువారం కథలాపూర్ రైతువేదికలో 'రైతు నేస్తం' కార్యక్రమం ప్రారంభించనున్నట్లు ఏవో యోగితా తెలిపారు. రైతులు అధికసంఖ్యలో హాజరు కావాలని కోరారు.

నేడు రైతు వేదికలో రుణమాఫీ సంబరాలు

కోరుట్ల రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రూ. 1 లక్ష రుణమాఫీ డబ్బులు విడుదల చేస్తున్న సందర్భంగా మండలంలోని రైతు వేదికల్లో గురువారం సంబరాలు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి నాగమణి బుధవారం తెలిపారు. అయిలాపూర్ రైతు వేదికలో సాయంత్రం 4 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగం ప్రత్యక్ష ప్రసారం, లబ్ధిదారులతో ముఖాముఖి చర్చ ఉంటుందని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, రైతులు హాజరు కావాలని కోరారు.

మల్లాపూర్: మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం సాయంత్రం 4 గంటలకు రుణమాఫీ సంబరాలను నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి లావణ్య తెలిపారు. లక్ష లోపు రుణమాఫీ ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించి అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ లబ్ధిదారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖాముఖి మాట్లాడనున్నారని తెలిపారు. సంబరాల్లో పెద్ద సంఖ్యలో రైతులు, లబ్ధిదారులు పాల్గొనాలని కోరారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



రాయికల్: పట్టణానికి చెందిన విజయ్‌కుమార్–హారిణి దంపతుల కుమారుడు హశ్వంత్ జన్మదినోత్సవం సందర్భంగా బుధవారం ఒడ్డెలింగాపూర్‌లో నిరుపేదలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు కడకుంట్ల జగదీశ్వర్, చింతకుంట సాయికుమార్, కిరణ్, భూక్య గంగాధర్‌నాయక్, రవీందర్ పాల్గొన్నారు.



పెగడపల్లి శివాలయంలో భక్తులు



బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో భక్తుల పూజలు

ఘనంగా తొలి ఏకాదశి

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో తొలి ఏకాదశి పండగ వేడుకలను బుధవారం ఆయా గ్రామాల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంతో పాటు, ప్రముఖ పుణ్యక్షేత్రం దుబ్బరాజన్న ఆలయం, ఇతర ఆలయాల్లో భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామిని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ దంపతులుదర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పెగడపల్లి: తొలి ఏకాదశి వేడుకలు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని పలు ఆలయాల్లో పూజారులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామ శివారులోని సహస్త్ర లింగాల ఆలయంలో బుధవారం ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



మల్లాపూర్: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో బుధవారం తొలి ఏకాదశి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. తొలి ఏకాదశి, మొహర్రం ఒకే రోజు రావడంతో భక్తులు పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా తొలి ఏకాదశి సందర్భంగా ఆలయాలన్ని భక్తులతో సందడి నెలకొంది. వాల్గొండ శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.



సహస్ర లింగాల ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

హిందూ ధర్మాన్ని పరిరక్షించాలి



మాట్లాడుతున్న లక్ష్మీనర్సయ్య

రాయికల్: హిందూధర్మం కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఖండ సంపర్క్ పందిరి లక్ష్మీనర్సయ్య అన్నారు.మండలంలోని కుమ్మరిపల్లి, దావన్‌పల్లిలో బుధవారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతన హిందు ధర్మ పరిరక్షణ కోసం విశ్వగురు భారత్ ధ్యేయంగా ఆర్ఎస్ఎస్ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు

ఇబ్రహీంపట్నం/మల్లాపూర్: ఇబ్రహీంపట్నం,మల్లాపూర్ మండలాల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి మల్లాపూర్ మండలం రాఘవపేట సబ్‌స్టేషన్‌లో గురువారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు లోకల్ కోర్టు నిర్వహిస్తున్నట్లు ఏడీఈ శ్రీనివాస్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి పరిష్కార వేదిక చైర్మన్ ఎస్.రామకృష్ణ మెంబర్ ఎల్.కిషన్, ఎమ్.రాజగౌడ్ పాల్గొంటారని, ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

మాజీ ఎంపీటీసీకి సన్మానం



మాజీ ఎంపీటీసీని సన్మానిస్తున్న గ్రామస్తులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండలో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం మాజీ ఎంపీటీసీల మండల ఫోరం అధ్యక్షుడు పానకంటి వెంకటిని ముదిరాజ్ యూత్ సభ్యులు, గ్రామ యువజన సంఘాల సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ఎంపీటీసీగా 5 ఏళ్ల పాటు మచ్చ లేని నాయకుడిగా గ్రామాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులు, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



తాండ్ర్యాల గ్రామశివారులో డబుల్ రోడ్డుపై ప్రమాదకరంగా గుంతలు

రోడ్డుపై గుంతలు.. ప్రయాణికులకు ఇబ్బందులు

కథలాపూర్: కోరుట్ల– వేములవాడ రహదారిలో కథలాపూర్ మండల పరిధిలో పలు గ్రామాల్లో తారు రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. బస్సులు, ఆటోల డ్రైవర్లు గుంతలను గమనించకుండా వెళ్లడంతో అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు అవస్థలపాలవుతున్నారు. కొందరు వాహనాల పైకప్పుకు తగిలి గాయాలపాలవుతున్నారు. రాత్రివేళల్లో గుంతను తప్పించబోయి ఎదురుగా వస్తున్న వాహనాలకు ఢీకొట్టిన సంఘటనలున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు చొరవ చూపి కోరుట్ల– వేములవాడ రహదారిపై గుంతలు ఉన్న మరమ్మతు చేయించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



దుంపేట వరదకాలువ వంతెనపై గుంత

బైక్ చోరీ

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్‌కు చెందిన నాయిని లచ్చం బైక్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. లచ్చం తన బైక్‌ను రాత్రి ఇంటి ముందు నిలిపాడు. బుధవారం ఉదయం చూసేసరికి బైక్ కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.